మొదటిరోజు ప్రశాంతం

☛ టెట్‌కు 1,117 మంది హాజరు


చిన్నారిని ఎత్తుకుని పరీక్ష రాసేందుకు వచ్చిన తల్లి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలో భాగంగా మొదటి రోజు గురువారం 1,262 మంది హాజరు కావాల్సి ఉండగా 1,117 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. 145 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పరిశీలకుడు నరసింహారావుతో కలిసి ఆదోని, ఎమ్మిగనూరులోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.


పత్రాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది


పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వేచి ఉన్న అభ్యర్థులు
చిత్రాలు : ఈనాడు, కర్నూలు

జీవనోపాధుల కల్పనకు ప్రతిపాదనలు పంపండి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పక్కన జేసీ డా.బి.నవ్య

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఆర్ఐడీఎఫ్, నాబార్డు గ్రాంటు కింద చిన్ననీటి పారుదల, జీవనోపాధుల కల్పనకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో ఆర్ఐడీఎఫ్, నాబార్డు గ్రాంట్ బేస్డ్ ప్రాజెక్టుల అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5 వేల జనాభాకు పైగా ఉన్న మేజర్ పంచాయతీల్లో రైతుబజార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. దేవనకొండ క్రాస్ వద్ద ఉల్లి పంటకు సంబంధించిన రూరల్ హాట్స్ ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు విజయవంతంగా నడుస్తున్నాయని, అక్కడికి వెళ్లి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మన జిల్లాలోనూ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పుచ్చకాయలమడ గ్రామానికి హంద్రీనీవా కాలువ నుంచి నీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయడంతో పాటు డీపీఆర్ రూపొందించాలని ఎస్ఈని ఆదేశించారు. పలు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ డా. బి.నవ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సమావేశానికి హాజరైన వైద్యులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: సైబర్ నేరాల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన వైద్యులతో గురువారం సమావేశమయ్యారు. మాదక ద్రవ్యాలపై ప్రజలను, విద్యార్థులను చైతన్యపరిచి వాటిని అడ్డుకునేలా సహకరించాలన్నారు. సైబర్ నేరగాళ్లు పలు విధాలుగా మోసాలకు పాల్పడుతున్నారని, తొందరపడి నమ్మొద్దని కోరారు. హరియాణా, దిల్లీ రాష్ట్రాల నుంచి ఎక్కువగా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వైద్యులు పలు అంశాలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఎల్‌సీ కేసులు ఆసుపత్రికి వచ్చినప్పుడు తలెత్తే సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్, కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, ఐఎంఏ అధ్యక్షుడు రామచంద్రనాయుడు, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి మాధవిశ్యామల పాల్గొన్నారు.

జలకలే

- పూర్తిస్థాయిలో బోర్లు వేయించని గత వైకాపా సర్కారు
- బిల్లుల బకాయిలతో ఆగిపోయిన పథకం

మెట్ట ప్రాంత రైతుల ప్రయోజనార్థం అమలు చేసిన వైఎస్సార్ జలకళ పథకం వైకాపా ప్రభుత్వ తీరుతో నీరుగారిపోయింది. వైకాపా మద్దతుదారుల పొలాల్లో మాత్రమే బోర్లు వేయడంపై శ్రద్ధ చూపారు. అర్హులైన పేద రైతులను గాలికొదిలేశారు. మరోవైపు ఈ పథకం అమలులో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయి. డ్వామా అధికారుల పర్యవేక్షణ లోపంతో చాలాచోట్ల పథకం గాడి తప్పింది. కొన్నిచోట్ల వేసిన బోర్లకు బిల్లులు రాకపోవడంతో మిగతా పనులు ఆగిపోయాయి.



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020, సెప్టెంబరు 28న వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో 500 బోర్లు వేసేలా గత వైకాపా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. మొదటి ఏడాది నిర్దేశించిన లక్ష్యంలో 50 శాతం కూడా పురోగతి సాధించలేదు. 2022 మార్చి నాటికి ఉమ్మడి జిల్లాలో 1,522 బోర్లు వేయగా.. అందులో 1,323 వరకు వినియోగంలోకి తెచ్చారు. పథకాన్ని ప్రారంభించిన 32 నెలలకు కేవలం 33 బోర్లకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం కల్పించారు.

విద్యుత్తు కనెక్షన్ల భారం రైతులపైనే

జలకళ కింద వేసిన బోర్లకు సంబంధించి విద్యుత్తు కనెక్షన్‌కు అయ్యే ఖర్చులు లబ్ధిదారులే భరించాలని అధికారులు చెప్పారు. కనెక్షన్ తీసుకున్నాక మోటార్లు ఇస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గడివేముల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, పాణ్యం, ఆత్మకూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లో 964 బోర్లు మంజూరు చేశారు. వీటిలో కొన్ని బోర్లు వేసినా బిల్లులు మాత్రం చెల్లించలేదు. దీంతో రెండేళ్ల కిందటే ఈ పథకం అమలు నిలిచిపోయింది. అప్పటి నుంచి బోర్ల గురించి పట్టించుకునేవారే కరవయ్యారు.

☛ కర్నూలు జిల్లా పరిధిలో మద్దికెర, పత్తికొండ, హొళగుంద, గోనెగండ్ల, కోసిగి తదితర మండలాల్లో బోర్లు వేశారు. అయినా బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేశారు.

మోటార్ల ఏర్పాటులో నిర్లక్ష్యం

కర్నూలు జిల్లాలో 3,470 మంది రైతుల పొలాల్లో భూగర్భజల సర్వే పూర్తి చేశారు. 2,571 మంది రైతుల పొలాల్లో బోర్లు వేసేందుకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. మొత్తం 1,516 మంది రైతుల పొలాల్లో బోర్లు తవ్వించేందుకు రూ. 1506.29 లక్షల ఖర్చు చేశారు. జలకళ పథకం కింద బోర్లు తవ్వి విద్యుత్తు సదుపాయం ఉన్న రైతులకు ఇప్పటి వరకు 208 పంపుసెట్లను రూ. 294.81 లక్షల ఖర్చుతో మోటార్లు అమర్చారు. మిగిలిన 1,308 మంది రైతులకు పంపుసెట్లు మంజూరు చేయలేదు.

గిరిజన గ్రామాల్లో హడావుడే..

గిరిజనుల పొలాల్లో బోర్లు వేయించి వారికి జీవనోపాధి కల్పిస్తున్నట్లు అప్పటి ప్రజాప్రతినిధులు చెప్పారు. ఒక్క గ్రామంలో కూడా బోర్లు అందుబాటులోకి రాలేదు. నల్లమల అటవీ ప్రాంతంలోని డి.వనిపెంట, పెచ్చెరువు, తమ్మరాజుపల్లె, గాజులపల్లె ఆర్ఎస్, ఎల్‌కే తండా తదితర గ్రామాల్లో బోర్లు వేయాలని నిర్ణయించారు. గిరిజనులు విద్యుత్తు కనెక్షన్ల కోసం రూ. వేలల్లో ఖర్చు పెట్టే పరిస్థితి లేకపోవడంతో ఇక్కడ పథకం గాడితప్పింది. మరికొన్నిచోట్ల బోర్లు మంజూరు చేయిస్తామని గ్రామ నాయకులు కొందరు రైతుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

★ గడివేముల, మిడుతూరు, పాణ్యం, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాల్లో కొన్ని గ్రామాల్లో 200 అడుగుల లోతులో బోర్లు వేయకపోయినా వేసినట్లు బిల్లులు చేసుకున్నారు. డ్వామా అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో చాలాచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నాయి. పథకం పూర్తిగా వైకాపా నాయకుల కనుసన్నల్లో నడిచింది.

ఇప్పటివరకు మోటారు బిగించలేదు

- కె.పద్మ, రైతు, హాల్వి గ్రామం



మా పొలంలో 2022లో బోరు వేసి వదిలేశారు. విద్యుత్తు కనెక్షన్ తదితర సామగ్రి అందించాల్సి ఉండగా ఇవ్వలేదు. చివరికి అద్దెకు మోటారు తెచ్చుకుని బిగించుకున్నాం. కౌతాళం మండల పరిధిలో 200 మంది రైతులు జలకళ పథకం కింద దరఖాస్తు చేసుకోగా కేవలం 7 బోర్లు మాత్రమే వేశారు. బోర్లు వేసినా వాటికి ఇంతవరకు మోటార్లు బిగించలేదు. మోటారు, విద్యుత్తు కనెక్షన్ ఇస్తే కష్టాలు తీరుతాయి.

– న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణ (కౌతాళం)

భృంగి వాహనంపై ఆది దంపతులు


తలపై దీపాలు పెట్టుకుని నృత్యం చేస్తున్న కళాకారిణులు


శ్రీకృష్ణదేవరాయ గోపురం వద్ద పుష్పాలంకరణ


ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇస్తున్న ప్రధానార్చకులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశశక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేద పండితులు భ్రమరాంబాదేవికి పసుపు, కుంకుమ, ఫలాలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈవో, అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రారంభ పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ వేదికపై భ్రమరాంబాదేవి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లు భృంగి వాహనంపై కొలువుదీరారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో జరిగే ఉత్సవాల దృశ్యాలను పురవీధుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై భక్తులు వీక్షించారు. సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

దసరా ఉత్సవాల్లో నేడు..

శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి భక్తులకు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. ఉత్సవమూర్తులకు మయూర వాహనసేవ జరగనుంది.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య : కేజీబీవీల్లో ఒప్పంద పద్ధతిలో ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 70750 39990, 70751 59996 నంబర్లకు సంప్రదించాలన్నారు.

41 మంది ఎంపీడీవోల బదిలీ జాబితా విడుదల

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 41 మంది ఎంపీడీవోల బదిలీ జాబితాను జడ్పీ సీఈవో నాసరరెడ్డి గురువారం మరోసారి అధికారికంగా విడుదల చేశారు. ఈ మేరకు వివిధ మండలాలకు చెందిన ఎంపీడీవోలు తమకు కేటాయించిన మండల పరిషత్ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. గత వారం రోజులుగా జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, సీఈవో మధ్య నెలకొన్న వివాదం సద్దుమణగడంతో బదిలీల ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. జడ్పీ ఛైర్మన్ కొందరు ఎంపీడీవోలను ప్రతిపాదించడం.. మరోవైపు మంత్రులు, ఎమ్మెల్యేలు తాము ప్రతిపాదించిన ఎంపీడీవోల పేర్లను సీఈవోకు పంపారు. ఈ నేపథ్యంలో గత నెల 23న జడ్పీ సీఈవో 42 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, ఛైర్మన్ 40 మందిని బదిలీ చేయడంతో గందరగోళం నెలకొంది. చివరికి జడ్పీ ఛైర్మన్, సీఈవో మధ్య రాజీ కుదరడంతో బదిలీ జాబితా విడుదలైంది. మంత్రి బీసీ ప్రాతినిధ్యం వహిస్తున్న బనగానపల్లి నియోజకవర్గంలోనూ ఎంపీడీవోల నియామకం పూర్తైంది.

సప్లిమెంటరీ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీఈడీ 3వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ గురువారం తెలిపారు. మొత్తం 502 మంది పరీక్ష రాయగా 295 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

కొనుగోళ్లకు సై

నాలుగుచోట్ల సీసీఐ కేంద్రాల ఏర్పాటు

పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. కర్నూలు జిల్లా పరిధిలో ఆదోనితోపాటు ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు ప్రాంతాల్లో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయి. మొదట్లో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినా నాలుగింటికి మాత్రమే అనుమతి వచ్చింది. వ్యవసాయ మార్కెట్ యార్డు కేంద్రాల్లోకాక పత్తి జిన్నింగ్ పరిశ్రమల్లో కొనుగోలు కేంద్రాలను త్వరలో తెరవనున్నారు.

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే



ఉమ్మడి జిల్లాలో 2.70 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లా పరిధిలో 2 లక్షల హెక్టార్లు సాగవగా.. నంద్యాల జిల్లాలో 7 వేల హెక్టార్లకు మించలేదు. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లకు సీసీఐ ఆసక్తి చూపడంతో ధరల పెరుగుదలపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. 2024-25 సంవత్సరానికి పత్తికి ఇచ్చే మద్దతు ధరను సీసీఐ ప్రకటించింది. పొడుగు పింజ రకానికి క్వింటా రూ. 7,521, పొట్టి పింజకు రూ. 7,121గా నిర్ణయించింది. 2023-24లో మొదటి రకానికి రూ. 7,020, రెండో రకానికి రూ. 6,620 ప్రకటించింది. ఈ ఏడాది క్వింటాపై రూ. 501 పెంచింది.

ముందస్తుగా నమోదు

రైతులు తమ సమీపంలోని సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. నమోదైన తర్వాత కొనుగోలు తేదీ, ఏ కేంద్రానికి వెళ్లాలో.. వివరాలు అందుతాయి. రైతులు ఆరోజు పత్తిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో పత్తి రైతులంతా కేంద్రాల వద్ద బారులుదీరి నిలిచేవారు. ఫలితంగా గంటలు, రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. వాహనాల అద్దె, నిర్వహణ ఖర్చులన్నీ భరించాల్సి వచ్చేది. ప్రస్తుతం సులువుగా అమ్మకాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ధర నేలచూపు

ప్రస్తుతం విపణిలో పత్తి ధరలు నేలచూపు చూస్తున్నాయి. పదిహేను రోజుల కిందట పత్తి ధరలు క్వింటా రూ. 8,200 వరకు పలికింది. ఈ నేపథ్యంలో మంచి ధరలు ఉంటాయని అందరూ ఆశించారు. కొన్ని రోజులకే ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం క్వింటా గరిష్ఠ ధర రూ. 7,677 వరకు పలుకుతోంది. క్వింటాపై సరాసరిన రూ. 500-700 వరకు తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అతివృష్టి, అనావృష్టితో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీనికితోడు అప్పుడప్పుడూ వర్షాలు పడుతుండటంతో పొలాల్లో పత్తి తడిసి రంగు మారుతోంది. చీడపీడల సమస్య నెలకొంది. ఎలాగోలా వీటన్నింటినీ అధిగమించి విపణికి పత్తి తీసుకొచ్చినా ఆశించిన ధర లభించడం లేదు. బహిరంగ మార్కెట్లో పలుకుతున్న పత్తి ధరకు దగ్గరగా సీసీఐ మద్దతు ధర ఉండటంతో ఈసారి విపణిలో పోటీ పెరిగి మంచి ధరలు లభించే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

నవోదయం 2.0

■ నాటు సారా నిరోధించేలా ప్రణాళిక

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నాటుసారా పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ కసరత్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ నవోదయం 2.0 అమలు చేసి నాటుసారా నిరోధించాలని ఆదేశించిన నేపథ్యంలో ఆశాఖ చర్యలకు సన్నద్ధమవుతోంది. జిల్లా మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. సారా ప్రభావిత ప్రాంతాలను సారా రహిత ప్రాంతాలు తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నారు.

రెండుగా విభజించి..

మద్యనిషేధ, ఆబ్కారీ శాఖను రెండుగా విభజించి ఆ శాఖను బలహీనపర్చడంతో నాటుసారాపై చర్యలు కొరవడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు మద్యం దుకాణాలను ప్రభుత్వ మద్యం దుకాణాలుగా మార్చి ధరలను అమాంతం పెంచేసింది. మద్యం ధరలు ప్రియం కావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. దీంతో సదరు మందుబాబులు మళ్లీ నాటుసారా తాగటం అలవాటు చేసుకున్నారు. సారా తాగేవారి సంఖ్య పెరగడంతో మళ్లీ తాండాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు పెరిగాయి. పల్లెలు, పట్టణ ప్రాంతాలకు అక్రమ రవాణా చేశారు. చిత్తూరు జిల్లా నుంచి లారీల కొద్దీ బెల్లం దిగుమతి అయ్యేది. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా నాటుసారా దిగుమతి అయ్యేది. నాటుసారా అదుపు చేయలేని స్థాయికి విస్తృతమైంది.

సం॥	నాటుసారా కేసులు	స్వాధీనం చేసుకున్న సరకు (లీటర్లలో)
2023	577	6873
2024	746	9246

(జులై నెలాఖరు వరకు)

ముంచెత్తిన మద్యం

ఎన్నికల సమయంలో నాటుసారా ఏరులై పారింది. నాటుసారా కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం విక్రయించడంతోపాటు వాటి ధరలు పెంచటంతో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా పెరిగింది. ఆబ్కారీ శాఖ అక్రమ మద్యం నియంత్రించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడంతో నాటుసారాపై చర్యలు కొరవడ్డాయి. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో పోలీసులు నాటుసారాను పట్టించుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో వైకాపా ప్రభుత్వం నాటుసారా నిర్మూలించేందుకు అమలు చేసిన 'ఆపరేషన్ పరివర్తన' సఫలం కాలేకపోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం హానికరమైన నాటుసారా నిర్మూలనకు ప్రాధాన్యమిస్తూ నవోదయం పునఃప్రారంభించాలని ఆబ్కారీ శాఖను ఆదేశించింది. దాడులు, అవగాహన సదస్సులు, ప్రత్యామ్నాయ ఉపాధితో నాటుసారా నిర్మూలించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్న ఆ శాఖ నూతన మద్యం పాలసీ అమలు ప్రక్రియ పూర్తయిన వెంటనే నవోదయంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించనుంది.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఆబ్కారీ శాఖ అధికారులు

ఆపరేషన్ పరివర్తన విఫలం

ఉమ్మడి జిల్లాలో 14 మద్య నిషేధ, ఆబ్కారీ స్టేషన్ల పరిధిలో 180 నాటుసారా ప్రభావిత ప్రాంతాలున్నాయి. సారా తీవ్రతను బట్టి మూడు విభాగాలుగా విభజించారు. తీవ్ర స్థాయి సారా ప్రభావమున్న ప్రాంతాలను 'ఏ' కేటగిరీగా పరిగణించారు. ఇందులో 30 ప్రాంతాలున్నాయి. కర్నూలులోని బంగారుపేట, ఎర్రకత్వతాండా, గుడుంబాయితాండా, నందికొట్కూరు, కోళ్లబాపురం, ఆదోని, ఆరికెరతాండా, నెర్నికితాండా, కొత్తపేట, జేఎంతాండా, ఫ్లెండ్లిమర్రి, రోళ్లపాండుతాండా, నంద్యాల, వైకేతండా, ఎల్‌కేతండా, నెమళ్లకుంట, సుగాలిమెట్ట, నారాపురెడ్డికుంట, పాణ్యం చెంచు కాలనీ, చిన్నరాజుపాలెం తాండా, పుసుపులతండా, గడ్డివేకలపల్లి, ఇస్రానాయక్‌తండా, కొండమనాయునిపల్లె, పిక్కలపల్లి, సీతమ్మతండా, అలెబతండా, ముద్దవరం, యల్‌బండతండా, సిద్ధాపురం ఉన్నాయి. బీ కేటగిరీ 41, సీ కేటగిరి కింద 109 ప్రాంతాలున్నాయి. 2019 ముందు తెదేపా ప్రభుత్వం సారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దాడులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవటం, అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యపరిచారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి నాటుసారా తయారీకి దూరం చేశారు. పలు ప్రాంతాలను సారా రహిత ప్రాంతాలుగా ప్రకటించారు. అయితే వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నవోదయం పేరును ఆపరేషన్ పరివర్తనగా మార్చింది.

హోంగార్డుల పిల్లలు ఆదర్శంగా నిలవాలి



హోంగార్డు కుమారుడికి ప్రోత్సాహకం అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: హోంగార్డు పిల్లలు కష్టపడి ఉన్నత లక్ష్యం సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, వైద్య విద్య, పీజీ ఇతర కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 38 మంది హోంగార్డు పిల్లలకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రోత్సాహకాలు అందించి అభినందించారు. ఒక్కో విద్యార్థికి రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు ప్రతిభా ఉపకార వేతనాలు, కాంట్రిబూషన్ ఫండ్ కింద రూ.2 లక్షలు చొప్పున ఇద్దరికి, మ్యారేజీ గ్రాంటు కింద రూ.5 వేల చొప్పున నలుగురికి అందజేశారు. సదరన్ రీజియన్ హోంగార్డు దళాధిపతి మహేశ్‌కుమార్, హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్, ఆర్ఐ జావెద్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఎంతో మందికి ఉపాధి చూపుతున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరుతూ గురువారం ధర్నా చౌక్ వద్ద రైతు, ప్రజా సంఘాల నాయకలు దీక్ష చేపట్టి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం లడ్డూ రాజకీయాలు పక్కనబెట్టి విశాఖ ప్రైవేటీకరణ విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మాజీ నాయకులు గిడ్డయ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకులు శేఖర్, నాయకులు నాగన్న, కె.అరుణ, జయమ్మ, సుజాత, పద్మ, రమీజా, మధుసూదన్, దస్తగిరి, రమణ పాల్గొన్నారు.



కర్నూలు : లలితా పీఠంలో అమ్మవారికి అలంకరణ



అయ్యప్పస్వామి ఆలయంలో బాలత్రిపుర సుందరిగా..



పాతబస్తీ చిన్న అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిదేవిగా జగన్మాత



పాతబస్తీ గీతా మందిరంలో శృంగేరి శారదాంబగా..

జగన్మాత.. నమోస్తుతే

కర్నూలు నగరంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ప్రత్యేకంగా అలంకరించిన మండపాలు, ఆలయాల్లో అమ్మవారు కొలువుదీరారు. ప్రత్యేక అలంకరణలో ముస్తాబైన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కొన్ని ఆలయాల్లో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, కర్నూలు నగరం, కల్లూరు గ్రామీణ

నిమిషాంబ దేవాలయంలో ప్రత్యేక అలంకరణ



విద్యార్థుల జీవితాలతో చెలగాటం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల్లో జరిగిన పరీక్షా ఫలితాల విడుదలలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుండటంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు బీఈడీ కళాశాలల యాజమాన్యంపై బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన బీఈడీ పరీక్షల్లో ఒక అభ్యర్థి ఉత్తీర్ణత సాధించారు. ఈ అభ్యర్థి నగరంలోని ఓ ప్రైవేటు బీఈడీ కళాశాలలో 2021-23 విద్యా సంవత్సరంలో రెండేళ్ల బీఈడీ పూర్తి చేశారు. ఆయన మూడో సెమిస్టర్ ఫెయిల్ కావడంతో 2024 మే నెలలో నిర్వహించిన రెగ్యులర్ మూడో సెమిస్టర్‌తోపాటు సప్లిమెంటరీ లోనూ పాల్గొని పరీక్ష రాశారు. ఈ పరీక్ష జరిగి ఐదు నెలలు కావొస్తోంది. దీనికి సంబంధించిన ఫలితాలు ఇప్పటికీ విడుదల కాలేదు. తెలంగాణ డీఎస్సీలో అర్హత సాధించిన బీఈడీ అభ్యర్థులకు త్వరలో పత్రాల పరిశీలన చేస్తామని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 3,500 విద్యార్థులు మూడో సెమిస్టర్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఈ విషయాల్లో బీఈడీ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఆర్‌యూ పరీక్షల విభాగం అధికారులకు మధ్య గురువారం వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ.. సప్లిమెంటరీ మూడో సెమిస్టర్ ఫలితాలు ఇచ్చామని, రెగ్యులర్ ఫలితాలు త్వరలో ప్రకటిస్తామన్నారు.

రైలు సర్వీసుల రద్దు.. జనానికి పాట్లు

☛ దృష్టి సారించని ప్రజాప్రతినిధులు

☛ నేడు ఎంపీలతో ద.మ.రైల్వే జీఎం సమావేశం

ఈనాడు, కర్నూలు : రాష్ట్రంలోని ప్రధాన నగరమైన కర్నూలుకు రాజధాని అమరావతి (విజయవాడ) నుంచి ఒక్క రైలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం కర్నూలుకు కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకురాకపోగా ఉన్న రైలు సర్వీసులు రద్దైనా పట్టించుకోలేదు. రైలు సర్వీసుల కోసం స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి రైల్వే ఉన్నతాధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకపోవడంతో రద్దు చేసిన రైళ్లను ఎప్పటికి పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి. కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు ఉన్న ప్రత్యేక రైలు సర్వీసును సుమారు ఏడాది కిందట రద్దు చేశారు. వారానికి మూడు రోజులపాటు తిరిగే ఆ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నా అధికారులు దానిని పునరుద్ధరించడం లేదు. మచిలీపట్నం నుంచి కర్నూలు వరకు వచ్చే ఆ రైలును మంత్రాలయం వరకు పొడిగించారు. ఆ సర్వీసును ప్రతిరోజూ నడపాలని ప్రయాణికులు డిమాండు చేశారు. దీనిని నెరవేర్చకపోగా సర్వీసును ఏకపక్షంగా రద్దు చేశారు.

శిర్డీకి సర్వీసులు అవసరం

రాష్ట్రంలోని పలు ప్రాంతాలవారు శిర్డీ వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. కర్నూలు నుంచి వారంలో శని, ఆదివారాల్లో మాత్రమే నాగర్‌సోల్ వరకు వెళ్లేందుకు రైలు ఉంది. గుంటూరు నుంచి కర్నూలు మీదుగా ఔరంగాబాద్ వరకు ప్రతి రోజూ ఒక రైలు సర్వీసు నడుస్తోంది. దీనిని విజయవాడ నుంచి ప్రారంభించి నాగర్‌సోల్ వరకు నడిచేలా చర్యలు తీసుకుంటే శిర్డీ వెళ్లే ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉంటుంది.

● కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఉపయుక్తంగా ఉన్న హంద్రీ రైలును డోన్ వరకు పొడిగించవచ్చు. ఫలితంగా డోన్‌వాసులు కూడా అతి తక్కువ ధరకే హైదరాబాద్ వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది.



కర్నూలుకు పిట్‌లైన్ అవసరం

రైళ్ల ప్రాథమిక నిర్వహణ, సామర్థ్య పరీక్షల కోసం పిట్‌లైన్ సదుపాయం అత్యంత కీలకం. కాచిగూడ దాటిన తర్వాత తిరుపతి వరకు 24 బోగీల రైలును నిలిపే పిట్‌లైన్ లేదు. ఇది ఉంటే పలు నూతన రైళ్లను ప్రారంభించుకునే వెసులుబాటు కలుగుతుంది. కర్నూలులో పిట్‌లైన్ ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ నేటికీ సాకారం కాలేదు.

రిజర్వేషన్ సౌకర్యమేదీ..

డోన్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒకప్పుడు ఒక ఏసీ, రెండు సెకండ్ సిట్టింగ్ బోగీలుండేవి. డోన్ నుంచి తగిన డిమాండు లేకపోవడంతో ఆయా బోగీలను, రిజర్వేషన్ సదుపాయాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆ రైలుకు రిజర్వ్‌డ్ బోగీలు లేకుండా సాధారణ బోగీలతో నడుపుతున్నారు. ఆ రైలును కర్నూలు నుంచి నడిపేందుకు అన్నిరకాల అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. డోన్-గుంటూరు రైలు రేక్‌నే గుంటూరు నుంచి నరసాపూర్ వరకు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు రైళ్లను విలీనం చేసి కర్నూలు నుంచి నరసాపూర్ వరకు ఒక సర్వీసు నిర్వహించుకోవచ్చు.

● కర్నూలు నుంచి ముంబయి వరకు రైలు నడపాలన్న ప్రతిపాదన ఉంది. తాజాగా మంత్రి టి.జి.భరత్ కూడా గత నెల 19వ తేదీన దిల్లీ వెళ్లి రైల్వేశాఖ మంత్రిని కలిశారు. కర్నూలు నుంచి విజయవాడకు ప్రతి రోజూ ఒక రైలు, కర్నూలు నుంచి ముంబయికి వారానికి కనీసం రెండు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని సైతం వినతిపత్రం ఇచ్చారు.

రాజధానికి రైలు ఉండాల్సిందే

- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు



కర్నూలు నుంచి రాజధానికి వెళ్లేందుకు ఒక్క రైలు కూడా లేకపోవడం బాధాకరమైన విషయం. విజయవాడ వెళ్లేందుకు ఒక రైలు ఉండాల్సిందే. రైల్వే జీఎంతో మేము శుక్రవారం సమావేశమవుతున్నాం. కర్నూలుకు రైల్వేపరంగా జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తాను. కర్నూలు నుంచి మచిలీపట్నం రైలును పునరుద్ధరించాలని, విశాఖ వరకు మరో రైలు వేయాలని కోరుతా.

లా ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన లా 3, 5వ ఏడాదికి చెందిన 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కేసీకి 2,445 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయం నుంచి కర్నూలు కడప కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీరు రాజు గురువారం తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1.235 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. ఎగువ నుంచి వరద నీరు రావడం ఆగిపోవడంతో దిగువకు నీటి విడుదల ఆపేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ నాగభరత్(20) మృతిచెందారని పోలీసులు తెలిపారు. పలుకూరుకు చెందిన సీహెచ్ నాగరాజు కుమారుడు నాగభరత్ చదువు మానుకుని ఇంటిలో ఉండటంతో తండ్రి మందలించారు. గత నెల 29న పురుగు మందు తాగడంతో కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

కరవు భత్యం విడుదల చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెండు లక్షల మంది ఉద్యోగుల కరవు భత్యాన్ని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ డిమాండు చేశారు. ఎస్టీయూ సర్వసభ్య సమావేశం ఎమ్మిగనూరులోని కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. డీఏలు, సీపీఎస్ ఉద్యోగులకు ఉన్న బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చి మరిచారని మండిపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2019కి సంబంధించిన రెండు డీఏలు తక్షణమే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన ఇతర కరవు భత్యాలను వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లు బాబయ్య, ఎల్లప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్

పాజిటివ్ కేసులకు సత్వర వైద్యం అందించాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ల్యాబ్ టెక్నిషియన్లు డెంగీ, మలేరియా పాజిటివ్ కేసులపై బాధితులకు సత్వరమే వైద్యం అందించే విధంగా చూడాలని డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్‌రావు సూచించారు. నగరంలోని వైద్య కళాశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు అధ్యక్షతన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

7 నుంచి 11 వరకు తపాలా ఉత్సవాలు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: అక్టోబరు 7 నుంచి 11వ తేదీ వరకు కర్నూలు జిల్లాలోని 434 తపాలా కార్యాలయాల్లో జాతీయ తపాలా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కర్నూలు తపాల శాఖ ప్రధాన పర్యవేక్షకుడు జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం తన ఛాంబరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 7న అధిక మొత్తాలు, తపాలా మెయిల్ సర్వీసులను ఉపయోగించే వారితో సమావేశాలు, 8న పాఠశాల విద్యార్థులకు ఫిలాటలీ (స్టాంపుల సేకరణ)పై అవగాహన, క్విజ్, డాక్ధార్ వక్తృత్వ పోటీలు, 9న ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా మారథాన్, మొక్కల నాటడం నిర్వహిస్తామన్నారు. సహాయక పోస్టల్ పర్యవేక్షకులు నూరుల్లా పాల్గొన్నారు

కొడుకు వెంటే తల్లి

☛ ఒకే రోజు ఇద్దరు మృతి





వెంకటేశ్వర్లు, నారాయణమ్మ (పాత చిత్రాలు)

మద్దికెర, న్యూస్‌టుడే: కంటికి రెప్పలా చూసుకున్న కొడుకు కళ్లముందే కన్నుమూశాడు. కాటికి సాగనంపి పున్నామ నరకం నుంచి తప్పిస్తాడనుకుంటే.. తానే కాటికి పయనమయ్యాడు. పెద్దవాడు మృత్యుఒడి చేరాడని తెలిసి కన్న పేగు విలవిల్లాడింది.. తల్లడిల్లిన తల్లి గుండె ఆగింది.. కొడుకుకు తోడుగా తల్లి సైతం మరణించడం ఆ ఇంట విషాదం నింపింది.

మద్దికెర ఎస్సీ కాలనీకి చెందిన నారాయణమ్మ(80)కు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు వెంకటేశ్వర్లు(53) కొంత కాలంగా అనారోగ్యం బారిన పడి, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందారు. కుమారుడి మరణాన్ని తట్టుకోలేని తల్లి మూడు గంటల వ్యవధిలోనే చనిపోయారు. గంటల వ్యవధిలోనే తల్లీ కుమారులు మృత్యుఒడి చేరటంతో బంధువులు శోకసంద్రంలో మునిగారు. వెంకటేశ్వర్లు కూలిపనులు చేస్తూ.. కుటుంబాన్ని పోషించే వారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లి కూడా తనతోనే ఉండేది. అనారోగ్యం బారిన పడిన ఆయన కొంత కాలంగా పనులకు వెళ్లలేకపోతున్నారు. వెంకటేశ్వర్లు కుమారుడు బేల్దారి పనులకు వెళ్తూ.. కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఇటీవల సమాచారం అందుకున్న మాజీ సర్పంచి కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, ఆయా పార్టీల నాయకులు మురళీధర్‌రెడ్డి, ధనుంజయ యాదవ్ తదితరులు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మున్సిపల్ వైస్ ఛైర్మన్‌పై కేసు నమోదు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కొమ్ము రాజు, డాక్యుమెంటరీ రైటర్ చాంద్‌పీరాపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన గోల్డ్‌స్మిత్ ముల్లా రఫీక్‌తో వైస్ ఛైర్మన్, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్, దస్తావేజులేకరి గురువారం ఘర్షణకు దిగారు. దీంతో బాధితుడు రఫిక్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆస్తినష్టం కలిగించిన కేసులో 24 మందిపై...

ఆలూరు గ్రామీణ, దేవనకొండ, న్యూస్‌టుడే: పవన విద్యుత్తు సంస్థల కార్యాలయాలపై దాడులు చేసి ఆస్తినష్టం కలిగించిన కేసులో 24 మందిని అదుపులోకి తీసుకున్నాట్లు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. ఆలూరులో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు వెంకటేశ్వర్లుతో పాటు మరో 23 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కంపెనీలపై దాడులు చేసి ఉద్యోగులను భయంభ్రాంతులకు గురిచేశారన్నారు. ఆలూరు మండలం మొలగవల్లిలో రూ.50 వేలు ఆస్తి నష్టం జరగగా, ఆస్పరి మండలం జొహరాపురంలో రూ.20 వేలు, దేవనకొండ మండలం మాదాపురంలో జరిగిన దాడిలో రూ.30 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. వీరిపై అక్రమ ప్రవేశం, ధ్వంసం, బెదిరింపులకు పాల్పడటం వంటి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుమ్మనూరు నారాయణతో పాటు మరికొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

నయనానందం.. నృత్యాభినయం

☛ జాతీయ స్థాయిలో బాలికల ప్రతిభ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బాలికలు తమ నృత్య ప్రదర్శనతో అబ్బురపరుస్తున్నారు. వివిధ రంగాల్లో తమ ముద్ర వేసుకుంటూ రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలతో ప్రత్యేకత చాటుకుంటున్నారు ఎమ్మిగనూరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు. జాతీయ స్థాయిలో అవార్డులు పొందాలని నిరంతర నృత్య సాధన చేస్తున్నారు.

50 ప్రదర్శనలు.. 15 పురస్కారాలు



నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో ఐదేళ్లుగా కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నాను. జతులు, స్వరాలు, పద వర్ణాలు, పద స్వరాలలో మెలకువలు నేర్చుకుంటున్నా. అంతర్రాష్ట్ర కూచిపూడి పోటీల విభాగంలో ప్రదర్శన ఇచ్చా. 2021లో హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభా పురస్కారం అందుకున్నాను. అదే ఏడాది తెలుగు బుక్ ఆఫ్ ఇండియావారు రాజమహేంద్రవరంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నా. 2022 మార్చిలో హంపిలో జరిగిన నృత్య ప్రదర్శనలో ప్రతిభా పురస్కారం అందుకున్నాను. ఇప్పటి వరకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో 50 ప్రదర్శనలు ఇచ్చాను. 15 వరకు ప్రతిభా పురస్కారాలు పొందాను. 2023లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో తిరుపతి, హైదరాబాద్, శ్రీశైలం, రాయచూర్, బెంగళూరు, నెల్లూరు, మహానంది, బళ్లారి, హంపి, గుంటూరు తదితర చోట్ల ప్రదర్శనలు ఇచ్చాను. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నాట్యానికి సంబంధించి కళాశాల బృందాలు నిర్వహించిన నాట్య తిలక్, నాట్యబాల, నాట్యసుధ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సాధించాను.

తృతీయ స్థానంలో నిలిచి..



నేను ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో భరత నాట్యం నేర్చుకుని ఆరేళ్లుగా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నా. సుబ్బారెడ్డి ఫౌండేషన్ ద్వారా పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు వంద ప్రదర్శనలు ఇచ్చాను. భస్మాసుర నృత్యంతో గుర్తింపు వచ్చింది. మూడేళ్లుగా నెల్లూరు, బెంగళూరు, తిరుపతి, మహానంది, బళ్లారి, తిరుపతి, మంత్రాలయం, శ్రీశైలం, నంద్యాల, హైదరాబాద్, రాయచూరు, హంపిలో జరిగిన నృత్య ప్రదర్శనల్లో పాల్గొని పురస్కారాలు అందుకున్నాను. 2022లో తెలంగాణ, ఏపీ రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాను. 8 రాష్ట్రాల్లో జరిగిన జాతీయ పోటీల్లో తృతీయ స్థానం సాధించా. ప్రస్తుతం మళ్లీ జాతీయ పోటీల్లో ప్రదర్శనకు ప్రతిరోజూ సాధన చేస్తున్నా.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

రైతులకు శనగ విత్తనాల పంపిణీ

పత్తికొండ గ్రామీణం, మద్దికెర, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. మండలంలోని హోసూరు, బురుజుల గ్రామాల్లో రైతులకు గురువారం శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు కె.సాంబశివారెడ్డి, బురుజుల సర్పంచి పద్మావతి, మద్దికెర మండల తెదేపా నాయకులు పురుషోత్తంచౌదరి, ధనుంజయ, రాజన్నయాదవ్, ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి వెంకటరాముడు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బదిలీపై శిరివెళ్లకు వెళ్తున్న వెల్దుర్తి ఎంపీడీవో శివమల్లేశ్వరప్పను స్థానిక కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

ఇళ్లలో సోదాలు

హొళగుంద, న్యూస్‌టుడే: కొత్తపేట గ్రామంలో అనుమానిత ఇళ్లలో పోలీసులు గురువారం విస్తృతంగా సోదాలు నిర్వహించినట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు. దసరా బన్ని ఉత్సవాలు దృష్టిలో ఉంచుకుని అనుమానిత ఇళ్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హొళగుంద, హాలహర్వి, ఆలూరు ఎస్సైలు, చంద్ర, వెంకట నరసింహులు, పోలీసులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

కృష్ణగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** కోయిలకొండలోని కంబాలపాడుకు దారిలో మురుగు కాల్వలు చెత్తతో నిండాయి. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వలు శుభ్రం చేయాలి. **- గంగన్న, కంబాలపాడు**

సమాధానం: ఈ విషయం కాలనీ వాసులు తెలిపారు. త్వరలోనే కాల్వలు శుభ్రం చేయిస్తాం. **- లక్ష్మీశ్వరయ్య, సర్పంచి**

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెర బస్టాండు ప్రాంతం నుంచి స్థానిక పోలీసు స్టేషన్ వరకు ఒక వైపే మురుగు కాల్వ ఉంది. రెండు వైపులా కాల్వలు నిర్మించి ఆక్రమణలు తొలగించాలి. **- రామాంజనేయులు, మద్దికెర**

సమాధానం: ఈ విషయమై పరిశీలించి కాల్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. రహదారి వెడల్పుకు చర్యలు చేపడతాం. **- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర**

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** స్థానిక బసవేశ్వర ఆలయం వెనుక రహదారిలో మురుగు కాల్వలో చెత్తచెదారం నిండిపోయింది. దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించగలరు. **- వీరేష్, హొళగుంద**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. **- రంగమ్మ సర్పంచి, హొళగుంద**

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణంలోని క్రాంతినగర్‌లో ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు సవ్యంగా రావడం లేదు. దీని వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. **- నాగరాజు, ఆదోని**

సమాధానం: ప్రజారోగ్య విభాగం ద్వారా శుభ్రత పనులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

శుద్ధ అబద్ధం



పత్తికొండ మండలం జూటూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 187 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు శుద్ధ జలం అందించాలన్న లక్ష్యంతో నాడు- నేడు పథకం కింద ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం ఆర్వో ప్లాంట్ల నిర్వహణ సరిగా చేపట్టకపోవడంతో రెండేళ్లుగా యంత్రం మూలకు చేరింది. పంచాయతీ కుళాయి నీరే తాగుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

బిణిగేరికి వెళ్లాలంటే వణకాల్సిందే

మంత్రాలయం నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. ఆస్పరి నుంచి ఆదోనికి ఇదే దారిలో వెళ్తుంటారు. దారంతా గుంతలు ఏర్పడ్డాయి. వైకాపా ప్రభుత్వంలో గుంతల్లో కంకర వేసి వదిలేశారు. కురుస్తున్న వర్షాలకు కంకర పూర్తిగా తొలగిపోయి గోతులు మిగిలాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిణిగేరి గ్రామంలో గుంతలు ఉండటంతో రాత్రి సమయంలో రహదారి దాటేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
– న్యూస్‌టుడే, ఆస్పరి



కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు దేవేంద్రప్పకు కురువ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని కురువ సంఘం నాయకులు హల్వి రమేష్, నాగరాజు, శక్రప్ప, గర్జప్ప, బీరప్ప అన్నారు. ఆదోనిలో గురువారం వారు మాట్లాడారు. దేవేంద్రప్ప కురువ సంఘం జిల్లా అధ్యక్షుడుగా, తెదేపా నాయకులుగా పనిచేయడం జరిగిందన్నారు. 30 సంవత్సరాలుగా తెదేపాలో ఉంటున్నారని, న్యాయం చేయాలన్నారు.

రాయితీ విత్తనాలతో మేలు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: రాయితీపై అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి రామాంజనేయులు సూచించారు. విత్తనాలు అవసరమైనవారు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆదోని మండలానికి 520 క్వింటాళ్ల విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. క్వింటాలు ధర రూ.9,400 ఉండగా.. రాయితీపై రూ.7,050 లకు అందిస్తున్నట్లు వివరించారు.

వాణిజ్య సముదాయం.. నెరవేరని లక్ష్యం



మట్టి పనులు జేసీబీ యంత్రం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని వాణిజ్య సముదాయ నిర్మాణ పనులు గురువారం చేపట్టారు. నిర్మాణంపై గత నెల పురపాలక కౌన్సిల్ సమావేశంలో వివాదం నెలకొంది. పనులు దక్కించుకున్న గుత్తేదారుడికి బిల్లులు చెల్లించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని వైకాపా సభ్యులు పట్టుబట్టారు. నిర్మాణం పూర్తిచేయకుండానే గడువు ఉన్నా, బిల్లులు ఎలా చెల్లిస్తామని, మీరు చెప్పినట్టు బిల్లులు విడుదల చేశాక, మధ్యలో వెళ్లిపోతే పరిస్థితేంటని ఎమ్మెల్యే పార్థసారథి సభ్యులను ప్రశ్నించారు. పనులు స్వీకరించిన రోజు నుంచి 30 నెలల్లో నిర్మాణ పనులు పూర్తిచేసి దుకాణాలను అప్పగించాలి. ఇప్పటికే ఒప్పందం ప్రకారం పది నెలలు గడిచింది. 20 నెలల గడువుంది. ఆ లోపు పనులు పూర్తిచేస్తారా? లేక బిల్లుల కోసం ఇదో స్టంట్‌లా వాడుకుంటారా అనేది ప్రశ్నగా మారింది.

పురపాలకం:	ఆదోని
పనులు:	పాత రిక్రియేషన్ క్లబ్ మైదానంలో వానిజ్య సముదాయాల నిర్మాణం
నిధులు:	రూ.33కోట్లు
సముదాయాలు:	04
దుకాణాలు:	363

ఉద్దేశం: వీటిని గుడ్‌విల్ వేలం ద్వారా ఆర్థిక వనరులు సమకూర్చుకుని, వచ్చే డబ్బుతో దుకాణ సముదాయం నిర్మించి ఔత్సాహికులకు అప్పగించాలి.

ఇదీ జరిగింది: వైకాపా మాజీ ప్రజాప్రతినిధికి చెందిన ముఖ్య అనుచరుడు పనులు దక్కించుకున్నారు. 2013 నవంబర్ 11న పనులు ఒప్పందం చేసుకుని, ఎన్నికల ముందు హడావుడిగా 2024 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. వంద శాతం పనుల్లో, కేవలం 8 శాతం పనులు పూర్తిచేసి, ఎన్నికల ఫలితాల ముందు పనులు ఆపేశారు. దీంతో నాటి నుంచి పనులు ఆగిపోయి, పునాదుల నుంచి నీరు ఊరుతోంది.

అయోమయంలో వ్యాపారులు

మరోవైపు పట్టణ నడిబొడ్డున దుకాణ సముదాయం నిర్మాణం కావడంతో ఔత్సాహికుల్లో చాలా మంది ముందుకొచ్చారు. పురపాలక కార్యాలయ ఆవరణలో 2022లో బహిరంగ వేలాల ద్వారా దూకాణాలను పోటాపోటీగా వేలం ధరల్లో పాల్గొని దక్కించుకున్నారు. ఒక్కో దూకాణం గరిష్ఠంగా రూ.10-63 లక్షలు వరకు పలికాయి. మొత్తం ధరల్లో నాలుగు భాగాలుగా చెల్లింపునకు అవకాశం కల్పించి, వేలం పాటలో దక్కించుకున్న తక్షణమే పాతిక శాతం(మొదటి విడత) నగదు చెల్లించేలా నిబంధన విధించారు. ఇలా 24 మంది వ్యాపారులు వేలం ద్వారా దుకాణాలు దక్కించుకున్నారు. వీరి ద్వారా రూ.4.50 కోట్లు నగదు జమ అయింది. వేలాలు నిర్వహించి మూడేళ్లు గడుస్తోంది. ప్రభుత్వం మారింది. అధికారులు అదిగో ఇదిగో అని కాలం గడుపుతున్నారు. అప్పులు చేసి రూ.లక్షలు చెల్లించి, నేటికీ బ్యాంకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు. తాము చెల్లించి డబ్బులు తిరిగి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా నిర్మాణాల్లో వేగం పెంచి తమ దూకాణాలు తమకు కేటాయించాలని వ్యాపారులు కోరుతున్నారు.

పొంగిన కల్లివంక



ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు సమీపంలోని కల్లివంక గురువారం రాత్రి పొంగిపొర్లింది. మండలంలోని ఆలూరు, మొలగవల్లి ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడంతో వాగులో నీటి ప్రవాహం పెరిగింది. రహదారిపైకి ఎక్కి పారడంతో ఆలూరు నుంచి గుంతకల్లు వెళ్లే వాహనాల రాకపోకలు స్తంభించాయి. రహదారిపై వంతెన లోతట్టుగా ఉండటంతో ప్రవాహం ఉద్ధృతంగా ఉంది. ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఎస్సై వెంకటనరసింహులు, హాలహర్వి ఎస్సై చంద్ర వంక వద్ద రాత్రి సైతం విధులు నిర్వహిస్తూ.. వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలు

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ సమీపంలోని కర్నూలు-బళ్లారి రహదారిలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొని గాయాలయ్యాయి. యువకుడి తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. 28 ఏళ్ల యువకుడికి చేతులపై శిలువ, దుర్గమ్మ, జ్యోతి, 134 నంబరు పచ్చబొట్లు ఉన్నాయన్నారు. పత్తికొండ నుంచి దేవనకొండకు ఆర్టీసీ బస్సులో టిక్కెట్ తీసుకున్నాడని పోలీసులు తెలిపారు.

హారన్ గట్టిగా కొట్టాడని దాడి


గణేకల్ (ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని గణేకల్‌కు చెందిన రైతు వీరేశ్ ఎద్దులతో పొలానికి వెళ్తున్నారు. అటువైపు కౌతాళం మండలం ఉరుకుందకు చెందిన మహదేవ ద్విచక్రవాహనంపై వెళ్తూ గట్టిగా హారన్ కొట్టడంతో ఎద్దులు బెదిరిపోయాయి. దీంతో మహదేవపై దాడి చేసినట్లు పెద్దతుంబళం ఎస్సై మహేశ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నాటు సారా స్వాధీనం

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలంలోని ఆలంకొండ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన కాశీనాథ్ అనే వ్యక్తి గ్రామ శివారులో నాటు సారా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై కె.మల్లికార్జున తెలిపారు. అతని దగ్గర ఏడు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో నాటుసారా విక్రయిస్తున్న జంకాన్‌వాడీకి చెందిన మహిళలు బోయ శాంతి, బోయ మల్లికను అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరోవైపు కర్ణాటక మద్యం తరలిస్తున్న వాల్మీకినగర్‌కు చెందిన నాగరాజును నల్లగేటు సమీపంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 7 బాక్సుల కర్ణాటక మద్యం, ద్విచక్రవాహనాన్ని జప్తు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పరిశ్రమలపై దాడులు సిగ్గుచేటు



పరిశీలిస్తున్న వీరభద్రగౌడు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రయాసలకోర్చి పరిశ్రమలను తెస్తుంటే.. ఆలూరు వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షి సోదరుడు, అనుచరులు కంపెనీ కేంద్రాలపై దాడులను చేయడం సిగ్గుచేటని ఆలూరు తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్రగౌడు అన్నారు. ఆయన బాధితులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలూరు, ఆస్పరి, దేవనకొండ మండలాల్లోని పవన విద్యుత్తు ఉపకేంద్రాలపై దాడిచేసి ఆస్తి నష్టం కలిగించడం, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ దాడులకు పాల్పడిన ఎమ్మెల్యే సోదరుడు వెంకటేశ్‌తో పాటు బాధ్యులపై దాడులకు పాల్పడ్డారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రామనాథ్ యాదవ్, మండల కన్వీనర్ అశోక్, నాయకులు శ్రీనివాసులు, హనుమప్ప, రామాంజనేయులు, వెంకన్న, శివస్వామి, బంగారు రామకృష్ణ పాల్గొన్నారు.

పశువులను తప్పించబోయి..

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్విలోని జాతీయ రహదారిపై పశువులను తప్పించబోయి.. వాహనం బోల్తాపడిన ఘటన గురువారం జరిగింది. బాపురం గ్రామానికి చెందిన సోమేశ్, తన కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆలూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. బళ్లారి నుంచి ఆదోనికి వెళ్తున్న క్రూజర్ వాహనానికి పశువులు అడ్డుగా వచ్చాయి. వాటిని తప్పించే ప్రయత్నం చేశారు. మరోవైపు ద్విచక్రవాహనం రావడంతో దాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సోమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై చంద్ర ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను స్టేషన్‌కు తరలించి, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



జాతీయ రహదారిపై బోల్తా పడిన వాహనాలు

పోలీసు స్టేషన్లకు బారికేడ్ల విరాళం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో రహదారి ప్రమాదాల నివారణ కోసం ఆదోనిలోని క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ రూ.30వేలు విలువ చేసే ఆరు బారికేడ్లను ఆదోని మూడో పట్టణ పోలీసు స్టేషనకు అందజేశారు. సీఐ రామలింగమయ్యకు సంస్థ నిర్వాహకులు మేనేజరు గంగాధర్‌స్వామి, బ్రాంచి మేనేజరు హనుమంతు వాటిని అందించారు.



బారికేడ్లను సీఐకి అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

ఫ్యాషన్ డిజైనింగ్‌లో ప్రత్యేక శిక్షణ

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. శిక్షణలో విద్యార్థినులకు వివిధ రకాల టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు శిక్షకురాలు వెంకటగౌరి తెలిపారు. 12 రోజులు పాటు ఈ శిక్షణ కొనసాగుతోందని తెలిపారు.



విద్యార్థినులకు సూచనలిస్తున్న శిక్షకురాలు

కర్మాగారం ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

హొళగుంద, న్యూస్‌టుడే: చిన్నహ్యాట పంచాయతీ శివారులో ముగ్గురాయి పరిశ్రమ ఏర్పాటు కోసం వాతావరణ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి హాజరై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో చిన్నహ్యాట, బిజీ హళ్లి, పెద్ద హ్యాట గ్రామాల ప్రజలు తక్కువగా హాజరయ్యారు. గ్రామశివారులోని క్వారీ ప్రదేశంలో ఏర్పాటు చేయడంతో వృద్ధులు, మహిళలు రాకపోవడంతో, కొంతమంది గ్రామస్థులు సబ్ కలెక్టర్ ముందే అసహనం వ్యక్తం చేశారు, బ్లాస్టింగ్ చేసేటప్పుడు రైతులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంకు వివిధ జిల్లాల నుంచి ఎన్జీవోలు, పర్యావరణ పరిరక్షణ సామాజిక కార్యకర్తలు, హాజరైయ్యారు. హొళగుంద తహసీల్దారు ప్రసాదరాజు, చిన్నహ్యాట సర్పంచ్ యేసన్, ఎంపీటీసీ శివణ్ణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



చిన్నహ్యాటలో మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పొలం పిలుస్తోంది

రాంపల్లి(తుగ్గలి), న్యూస్‌టుడే: రాంపల్లి గ్రామంలో గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఈవో లక్ష్మి చైతన్య పాల్గొని రైతన్నలకు వ్యవసాయ సలహాలు అందించారు. క్షేత్ర స్థాయిలో ఆముదం పంట వద్దకు రైతన్నలను తీసుకెళ్లి అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన మెలకువలను తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు తిరుపాల్‌నాయుడు, శ్రీనివాసులు , వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో టెట్

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం టెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఆదోని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు పర్యవేక్షించారు. మొత్తం 200 మంది విద్యార్థులకు గానూ 157 మంది అభ్యర్థులు హాజరై పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టరు నరసింహారావు పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

సమయ పాలన పాటించకపోతే చర్యలు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని 21వ వార్డు సచివాలయాన్ని పురపాలక కమిషనర్ కృష్ణ గురువారం తనిఖీ చేశారు. దస్త్రాలతో పాటు ప్రతి సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యాక్రమ నిర్వహణపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

మరింత తగ్గిన పత్తి ధర

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. 7,945 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా, క్వింటాలు కనిష్ఠంగా రూ.4211, గరిష్ఠంగా రూ.7597, మధ్య ధర రూ.7389లు పలికాయి. ఈ నెల ఒక్కటో తేదీన గరిష్ఠ ధర రూ.7,635లు పలికింది. ఇదే పదిహేను రోజుల క్రితం క్వింటాలు గరిష్ఠ ధర రూ.8,200 దాకా ఉండేది. ఇలా రోజు రోజు ధరలు తగ్గిపోతుండటంతో పత్తి రైతులు దిగులు చెందుతున్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా వేదిక ఏర్పాటు చేసినట్లు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఎమ్మెల్యే ఛాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజల నుంచి వినతి ప్రతాలు స్వీకరించారు. అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అర్జీలను ఆన్‌లైన్లో నమోదు చేసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, మనోహర్‌చౌదరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

← ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

బ్యాటింగ్ యోధ శంకర్‌రెడ్డి

అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



బ్యాట్స్‌మెన్ యోధ శంకర్‌రెడ్డి

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: బ్యాట్ పట్టి మైదానంలో దిగితే ఈ కుర్రాడు పరుగుల వర్షం కురిపిస్తాడు. పేస్ బౌలర్లు బంతులు వేగంగా వేసినా.. స్పిన్ బౌలర్లు బంతిని గింగరాలు తిప్పినా తన బ్యాటింగ్ నైపుణ్యంతో బంతిని బౌండరీలు దాటిస్తాడు. తన బ్యాటింగ్ స్కిల్స్‌తో ప్రతిభ చాటి అండర్-14 జిల్లా క్రికెట్ జట్టులో స్థానం సంపాదించాడు. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైయ్యాడు. క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు యోధ శంకర్‌రెడ్డి.

రోజూ సాధన

ఆదోని పట్టణానికి చెందిన ఆదోని ఆర్ట్స్ కళాశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న కంబిరెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడు యోధ శంకర్‌రెడ్డి క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆదోని పట్టణానికి చెందిన క్రికెట్ కోచ్ బాలాజీరావు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. గత ఐదేళ్లుగా కుడిచేతి బ్యాట్స్‌మెన్‌గా సాధన చేస్తున్నాడు. పేస్ బౌలింగ్‌లో.. స్పిన్ బౌలింగ్‌లో రాణిస్తు బంతులను బౌండరీలు దాటిస్తున్నాడు. ప్రతిరోజూ దాదాపు రెండు గంటలకు పైగానే సాధన చేస్తున్నాడు. కోచ్ చెప్పే మెళకువలు పాటిస్తూ బ్యాటింగ్ స్కిల్స్‌ను నేర్చుకుంటూ ముందుకెళుతున్నాడు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు నగరంలో గత నెలలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ఆదోని కుర్రాడు యోధ శంకర్‌రెడ్డి అండర్-14 క్రికెట్ పోటీల్లో తన బ్యాటింగ్‌తో ప్రతిభ చాటాడు. పరుగుల వర్షం కురిపించాడు. బ్యాటింగ్ స్కిల్స్‌ను చూసిన జిల్లా క్రికెట్ సెలక్టర్లు కర్నూలు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 4వ తేదీ నుంచ 23వ తేదీ వరకు కడపలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున యోధ శంకర్‌రెడ్డి ప్రాతినిత్యం వహించనున్నారు. కాగా.. గత యేడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాట్నా నగరంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో యోధ శంకర్‌రెడ్డి రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిత్యం వహించి ప్రతిభ చాటాడు. ఇటీవల జిల్లా జట్టుకు ఎంపికైన యోధ శంకర్‌రెడ్డిని ఆదోని తాలుకా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కష్టపడి సాధన చేసి క్రికెట్‌లో ప్రతిభ కనబరచి జాతీయ జట్టుకు ప్రాతినిత్యం వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని.. అందుకు తగినట్లు సాధన చేస్తున్నానంటున్నాడు బ్యాట్స్‌మెన్ యోధ శంకర్‌రెడ్డి.

మెరిసిన ఎర్రపండు ధర



పత్తికొండ మార్కెట్‌లో విక్రయం కోసం ఉంచిన టమాటాలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధరలు మరోసారి మెరిశాయి. గురువారం క్వింటాలు గరిష్ఠ ధర రూ.5వేలకు పైగానే పలికింది. కనిష్ఠ ధర రూ.2,700 కాగా మధ్యస్థ ధర రూ.3,500 పలికింది. నాలుగు రోజుల కిందట క్వింటాలు 4,500 ఉన్న ధర మరో రూ.500 ఎగబాకి 5వేలు దాటింది. గురువారం మొత్తం 563 క్వింటాళ్ల దిగుబడి మార్కెట్‌కు వచ్చిందని మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నోలిస్ తెలిపారు. ఇదిలా ఉండగా రోజు రోజుకు పెరుగుతున్న ధరలతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యంగా చెల్లింపులు

టమాటా విక్రయించిన రైతులకు డబ్బులు ఇవ్వటంలో వ్యాపారులు ఆలస్యం చేస్తున్నారని కొందరు రైతులు ఆరోపించారు. బుధవారం అమ్మిన టమాటాలకు గురువారం డబ్బులు చెల్లించాల్సిన వ్యాపారులు ఇంకా రాలేదని, కొంత సేపు వేచి ఉండాలని చెప్పటంతో రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇదిలా ఉండగా సరకు కొన్న అనంతరం ఒక రోజు వ్యవధిలో రైతులకు చెల్లిస్తామని, ఇతర మార్కెట్లలో సరకు అమ్మగా వారి నుంచి కొంత ఆలస్యమైందని వ్యాపారులు చెప్పారు. ప్రస్తుతం క్వింటాలు టమాటా గరిష్ఠ ధర రూ.5వేలు దాటడంతో రోజుకు రూ.20 నుంచి 30 లక్షలు చెల్లించాల్సి వస్తోందని వ్యాపారులు పేర్కొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

దేవనకొండ, న్యూస్‌టుడే: వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి కల్యాణ్ చక్రవర్తి, మలేరియా సబ్ యూనిట్ నివారణ అధికారి సాయిబాబా వైద్య సిబ్బందికి గురువారం సూచించారు. దేవనకొండలో నాలుగేళ్ల బాలుడికి డెంగీ సోకినట్లు వెల్లడించారు. మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు మధు, శశిధర్, ప్రతాప్, యశ్వంత్, సూరి తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ సన్నిధిలో ప్రముఖులు


అమ్మవారిని దర్శించుకున్న ఆలయ నిర్మాణకర్త సినీ దర్శకురాలు శ్రీప్రియ, ఆమె కుమారుడు నాగార్జున

కె. నాగలాపురం, (గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: గూడూరు మండలం కె. నాగలాపురంలోని సుంకులమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలు ఎస్పీ బిందుమాధవ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఆలయ నిర్మాణకర్త సినీ దర్శకులు శ్రీప్రియ, ఆమె తనయుడు నాగార్జున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారికి స్వాగతం పలికి శాలువలతో సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో స్థానిక పోలీసులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసయ్య పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

మంత్రాలయం, న్యూస్‌టుడే: బెంగళూరుకు చెందిన రాఘవేంద్రస్వామి భక్తులు సుధా భాస్కర్ దంపతులు రూ.2లక్షలు శ్రీమఠంలో అన్నదానానికి విరాళంగా అందజేసినట్లు మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. గురువారం వారు మఠం చేరుకొని గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని విరాళాన్ని అందజేశారు. పీఠాధిపతి వీరికి ఫలమంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

మంత్రాలయం: సమస్య: గ్రామంలోని కాలువల్లో చెత్తా చెదారం నిండి, మురుగు రోడ్డుపై పారుతోంది. –గోపాల్, వగరూరు

సమాధానం: త్వరలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించి.. కాలువలు శుభ్రం చేయిస్తాం. –దాశరథి, పంచాయితీ కార్యదర్శి, వగరూరు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని గంగులపాడులో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతోంది. –గవిగట్టు, గంగులపాడు

సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం. –జనార్దన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

కౌతాళం, న్యూస్‌టుడే: **సమస్య:** హాల్వికి వెళ్లే మార్గంలో దారి పక్కన చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చర్యలు తీసుకోవాలి. –రమేశ్, కౌతాళం

సమాధానం: సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –శివప్ప, పంచాయతీ కార్యదర్శి, కౌతాళం

శ్రీమఠంలో వాసవీ సత్ర సమూహాల జాతీయ ప్రధాన కార్యదర్శి

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి దర్శనార్థం వాసవీ సత్ర సమూహాల జాతీయ ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, గాయత్రీ గో సేవ సమితి గౌరవ అధ్యక్షుడు విజయకుమార్, ఆర్యవైశ్య రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సుధాకర్ గురువారం మంత్రాలయం చేరుకున్నారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి వారికి ఫలమంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. మఠం ఏఏవో మాధవశెట్టికి వీరు శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

బృందావన ప్రతిమకు బంగారు పల్లకి సేవ

మంత్రాలయం, న్యూస్‌టుడే: అశేష భక్త జనవాహిని మధ్య బృందావన పల్లకి సేవ వైభవంగా జరిగింది. దసరా సెలవులు రావడంతో రాఘవేంద్రస్వామి బృందావన దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో మంత్రాలయం వచ్చారు. గురువారం అర్చకులు బృందావనానికి నిర్మాల్యం, పంచామృతాభిషేకం చేసి బంగారు, నవరత్న కవచాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. దుర్గా నవరాత్రులు పురస్కరించుకుని గ్రామ దేవత మంచాలమ్మ బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు అర్చకులు పంచ రథోత్సవాలు నిర్వహించారు. ఉదయం బంగారు పల్లకి సేవ, సాయంత్రం వెండి అంబరి, కొయ్య, వెండి రథం, బంగారు, నవరత్న రథాలపై ప్రహ్లాదరాయలను ఉంచి పీఠాధిపతి హారతి ఇచ్చారు.


శ్రీమఠం ప్రాకారంలో బంగారు పల్లకిలో బృందావన ప్రతిమకు హారతి ఇస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న దాసవాణి భక్తి గీతాలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: బెంగళూరుకు చెందిన సుష్మా జోషిస్ ఆలపించిన దాసవాణి భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నాదన మనె కార్యక్రమంలో భాగంగా శ్రీమఠం ప్రవచనా మందిరంలో గురువారం దుర్గా నవరాత్రులు పురస్కరించుకుని రాఘవేంద్రస్వామి భక్తి గీతాలు ఆలపించారు.

"ఇన్‌ఛార్జిగా ఎవరినీ నియమించలేదు"

మంత్రాలయం, న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ అధిష్ఠానం ఇంకా ఎవరినీ నియమించలేదని తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు పన్నగ వెంకటేశ్ స్వామితో కలిసి మంత్రాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఇన్‌ఛార్జిల నియామకంపై కసరత్తు చేస్తున్నారని, ఇప్పటి వరకు ఇంకా ఎవరినీ నియమించలేదని చెప్పారు.


సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు

అందని సేవలు.. రోగుల అవస్థలు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు పెద్ద దిక్కుగా మారింది. ఆసుపత్రికి రోగులు రాక, ప్రసవాలు పెరగడంతో ప్రభుత్వం వంద పడకలకు పెంచింది. అదే స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించారు. కానీ రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు.


ఆసుపత్రిలో బాలింతల వార్డు


వైద్యం కోసం వచ్చిన బాధితులు

పట్టని సమయపాలన

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 200లకు పైగా కాన్పులు చేస్తారు. రోజుకు ఓపీ 400 నుంచి 600 వరకు ఉంటుంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వైద్య సేవలు కోసం వస్తారు. కొందరు వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించకపోవడం, సరైన సేవలు అందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చాలని గదులు.. అపరిశుభ్ర పరిసరాలు

వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని రూ. 12.60 కోట్లతో చేపట్టారు. నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో వార్డులు చాలక వరండాల్లో మంచాలు వేసి వైద్యం అందిస్తున్నారు. నవజాత శిశువుల కోసం ఆధునిక పరికరాలు మంజూరు చేసినా స్థల భావంతో వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు, సిబ్బంది క్వార్టర్లు శిథిలావస్థకు చేరి ముళ్ల పొదలతో నిండి విష పురుగులు, పాములు సంచరిస్తుండటంతో రోగులు భయాందోళన చెందుతున్నారు.

పోలీసు పికెటింగ్‌కు గది లేదు

ఆసుపత్రిలో ఘర్షణలు జరిగినప్పుడు చికిత్స కోసం ఇరు వర్గాలకు చెందిన వారు గుంపులుగా చేరి ఒక్కొక్కసారి ఆసుపత్రి వద్ద మళ్లీ గొడవకు దిగుతున్నారు. ఇటీవల వైద్యం కోసం వచ్చిన నందవరం మండలం జోహరాపురానికి చెందిన ఇరువర్గాల వారు గొడవకు దిగారు. పోలీసు పికెటింగ్ సిబ్బంది కేటాయిస్తామని పోలీసు సబ్ డివిజన్ అధికారి చెప్పినా గది కేటాయింపులో నిర్లిప్తతతో అదికాస్త అటకెక్కింది. సూపరింటెండెంట్‌గా కొత్తగా నియమించిన సుధా వీటన్నింటిపై దృష్టి సారించి ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించి, రోగులకు నాణ్యమైన సేవలు అందించాల్సి ఉంది.

అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: చిరుత సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ బీట్ అధికారిణి అనురాధ గురువారం సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని హనుమాపురంలో చిరుత దాడిలో ఎల్లప్పకు చెందిన గేదె దూడలు చనిపోయాయి. గ్రామానికి వెళ్లి చనిపోయిన దూడలకు పశు వైద్యాధికారితో కలిసి పోస్టుమార్టం నిర్వహించినట్లు వెల్లడించారు. చిరుత దాడుల్లో చనిపోయిన పశువులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పయనమైన వలస బండి



పెద్దకడబూరు మండలం నౌలేకల్ గ్రామానికి చెందిన కొందరు తెలంగాణకు వలస వెళ్లారు. గ్రామంలో ప్రస్తుతం వ్యవసాయ పనులు తగ్గడంతో తెలంగాణలో పత్తి సుగ్గికి వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. అక్కడ కిలో పత్తి కోతకు రూ. 10 చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఓ కూలీ రోజుకు 60 నుంచి 70 కిలోల పత్తి తీస్తామని.. దీంతో రోజుకు రూ.600 నుంచి రూ. 700 సంపాదిస్తామన్నారు. గ్రామంలో ఒక రోజు పని ఉంటే మరో రోజు ఉండటం లేదని అందుకే తెలంగాణకు వెళ్తున్నట్లు కూలీలు పేర్కొన్నారు. ప్రస్తుతం దసరా సెలవులు రావడంతో బడి పిల్లలను సైతం తీసుకెళ్లారు.
–న్యూస్‌టుడే, పెద్దకడబూరు

రహదారి అధ్వానం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



మండలంలోని గంజహళ్లి పంచాయతీ చౌడమ్మ కాలనీలో కనీస వసతులు లేవు. చిన్నపాటి వర్షానికే రోడ్లంతా చిత్తడిగా మారుతుంది. ఈ దారిలో వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు, కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. అపరిశుభ్రంగా దోమల బెడద ఎక్కువైందని.. భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలు, సీసీ రోడ్ల ఏర్పాటు చేయాలని ఐదేళ్లుగా కోరుతున్నా స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

నేడు బాధ్యతలు స్వీకరణ

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు ఎంపీడీవోగా శివనాగప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయ సింహారెడ్డి గురువారం తెలిపారు. ఈయన ఓర్వకల్లు నుంచి గూడూరుకు బదిలీపై వస్తున్నారు.

గోనెగండ్ల ఏఈగా శంకర్

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల పంచాయతీరాజ్ ఏఈగా శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్లకు వచ్చారు.

సి.బెళగల్ ఏఈగా వెంకట ప్రకాశ్

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్ మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ శాఖ ఏఈగా వెంకట ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సి.బెళగల్‌లో విధులు నిర్వహించి డిప్యుటేషన్‌పై ఆలూరుకు వెళ్లారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు 16వ వార్డులో హోసన్న చర్చి కాలనీలో రోడ్లను 30 అడుగుల రహదారికి పరిమితం చేయాలని కాలనీ అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం పురపాలక కమిషనర్ గంగిరెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల కిందట కాలనీలో ఇళ్ల స్థలాలు కొన్నామన్నారు. అప్పట్లో మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం ప్రతిపాదనలు పెట్టారని.. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని సవరణ చేయడం సంతోషకరమన్నారు. గతంలో మాదిరిగా కాలనీలో 30, 24 అడుగుల రహదాలకు పరిమితం చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఈరన్న, దేవపుత్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

రైలు సర్వీసులను పునరుద్ధరించండి

తుంగభద్ర రైల్వే స్టేషన్, (మంత్రాలయం), న్యూస్‌టుడే: రద్దు చేసిన మూడు రైలు సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తుంగభద్ర రైల్వే స్టేషన్‌లో ఆదోని రైల్వే అధికారి ఏడీఈ ఎన్ షేక్ సిరాజ్, స్టేషన్ మేనేజర్ వాస్నిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ.. గుంతకల్లు ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, రాయచూరు-కాకినాడ సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు, రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి రైళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లక్ష్మణ్‌నాయక్, మండల సీపీఐ సహా కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌యూఎస్ఎఫ్, విద్యార్థి సంఘం నాయకుడు రఘునాథ్ డిమాండు చేశారు. గురువారం పాఠశాలను తనిఖీ చేయగా 120 మంది విద్యార్థులకు తరగతులను ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయుడు ఇష్టారాజ్యంగా తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకు ప్రధానోపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

యువత చేతిలో దేశ భవిష్యత్తు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: యువత చేతిలో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరూ సాంకేతిక రంగంలో రాణించి విజన్-2047 లక్ష్యంగా పని చేయాలని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. కళాశాలలో విజన్-2047 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధన మన చేతుల్లో ఉందని, ఇందు కోసం ప్రతి ఒక్కరూ కృషి అవసరమన్నారు. అభివృద్ధి గ్రామాల నుంచి జరగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ క్రాంతికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్‌గౌడ్, లక్ష్మన్న, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సాంకేతికతతో ఉన్నత స్థాయికి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాంకేతిక విద్యతో ఉన్నత స్థాయి చేరుకోవచ్చునని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యుడు వీరన్న పేర్కొన్నారు. గురువారం కళాశాలలో బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక కార్యక్రమంలో వివిధ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతను అందిపుచ్చుకోవాలన్నారు. కొత్త ప్రయోగాలతో రాణించి ప్రతిభ కనబరిస్తే ఉద్యోగ అవకాశాలు సులభంగా లభిస్తాయన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆదోనిలో ధర్నా చేస్తాం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ధర్నా నిర్వహిస్తామని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్లయ్య పేర్కొన్నారు. గురువారం కౌతాళంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తి క్వింటా రూ. 10 వేలకు కొనుగోలు చేయాలన్నారు. తేమ పేరుతో రైతులు తీసుకొచ్చి పత్తి దిగుబడిని ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.


మంచాలమ్మకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు


కోడుమూరు గ్రామీణం: మాలవీధిలో మండపంలో కొలువుదీరిన అమ్మవారు



కోడుమూరు గ్రామీణం: వర్కూరు మాధవస్వామి ఆలయంలో దుర్గాదేవి


సి.బెళగల్: వాసవీమాత ఆలయంలో బాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో

శైలపుత్రి.. బాలాత్రిపురసుందరి

ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లోన్ని ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్రోధి నామ సంవత్సర విజయదశమి మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అమ్మవారు తొలిరోజు బాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.
–న్యూస్‌టుడే బృందం


ఎమ్మిగనూరు వ్యవసాయం: వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బాలత్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు


ఎమ్మిగనూరు వ్యవసాయం: చేనేత మైదానంలో అలంకరణలో అమ్మవారు


మంత్రాలయం: విశేష అలంకరణలో గ్రామ దేవత మారికా దుర్గాదేవి


గోనెగండ్ల: కైరవాడిలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు


ఎమ్మిగనూరు: గాయత్రీదేవి ఆలయంలో


మంత్రాలయం గ్రామీణం: ఉప్పరహాల్‌లో బాలాత్రిపురసుందరి దేవి


కె.నాగలాపురంలో దర్శనమిచ్చిన అమ్మవారు


గూడూరు గ్రామీణం: గూడూరులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో


గూడూరు గ్రామీణం: తెలుగు వీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో

ఆక్రమించినా అడిగేవారు లేరు

4.71 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణ

కోసిగి, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు గ్రామాల్లో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే అండదండలతో ప్రభుత్వ స్థలాలు, కొండలను ఆక్రమిస్తున్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా నాయకులు ఇప్పటికీ ఆక్రమణలు తగ్గడం లేదు. ఖాళీగా ఉన్న స్థలాలను కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు అడ్డుపడితే కాసులు ఆశ చూపి వారి పని కానిచ్చేస్తున్నారు. ఏకంగా కొండనే ఆక్రమించిన అడిగే నాథుడే లేడని మండల ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు.


కొండ వెనుక భాగంలో ఆక్రమించిన స్థలం

కోసిగి మండలంలో ఐరన్‌గల్, దొడ్డి బెళగల్, ఆర్లబండ, కామన దొడ్డి, కోసిగి, జంపాపురం గ్రామంలో కొంత మంది వైకాపా నాయకులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్న ఆక్రమాలతో వైకాపా నాయకులు రెచ్చిపోతున్నారు. ఐరన్‌గల్ గ్రామ శివారులో పెద్ద భూంపల్లి, చిన్న భూంపల్లికి వెళ్లే రోడ్డు పక్కన సర్వే నంబర్ 155లో కొండ ప్రాంతంలో 4.71 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని గ్రామానికి చెందిన వైకాపా నాయకులు రెండు వర్గాల వారు రెండు భాగాలు చేసుకుని కొండ చుట్టు బండలు పాతి ఆక్రమించారు.

రెండు వర్గాలు చెరో సగం పంచుకున్నారు

మండల పరిధిలోని ఐరన్‌గల్ గ్రామ శివారులో 155 సర్వే నంబర్‌లో 4.71 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ముఖ్య నాయకుల అండదండలతో గ్రామానికి చెందిన వైకాపా నాయకులు కరికి వీర నాగప్ప కుమారులు నర్సన్న, నరసింహులు, మల్లయ్య, శ్రీరాములు, రామలింగ రోడ్డు పక్కన ఉన్న దాదాపు రెండు ఎకరాల కొండ స్థలాన్ని ఆక్రమించారు. అదే గ్రామానికి చెందిన కరికి చిన్న అల్లయ్య కుమారులు కరికి రామకృష్ణ, సోమశేఖర్, రాఘవేంద్ర, వీరారెడ్డి అనే వ్యక్తులు కొండ వెనుక భాగంలో ఉన్న 2.71 ఎకరాల స్థలాన్ని ఆక్రమించి అందులో పశువులను కట్టేసి, పశుగ్రాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలం విలువ దాదాపు రూ.80 లక్షలు ఉంటుంది. వీరికి గ్రామంలో ఉండే తలారి, వీఆర్వో, సర్వేయర్ సహకరించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కొండ చుట్టూ బండలు పాతి ఆక్రమించిన ఓ వర్గం

చర్యలు తీసుకుంటాం

–తహసీల్దార్, నిత్యానంద్ రాజ్, కోసిగి

స్థలాన్ని పరిశీలించి విచారణ చేపడుతాం. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం.

యువతి అదృశ్యం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మండలంలోని గుడేకల్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు గురువారం గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. గురువారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని యువతి తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని చిన్న నెలటూరులో రైతు బోయ మద్దిలేటి(41) చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయంలో నష్టాలు రావడంతో చేసిన అప్పులు చెల్లించలేక మనస్థాపంతో రెండు రోజుల కిందట పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

న్యాయం కావాలని దీక్ష

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామంలో తనను స్తంభానికి కొట్టేసి కొట్టిన వారిపై కేసు నమోదు చేయాలని కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మ డిమాండు చేశారు. గురువారం పట్టణంలో సోమప్ప కూడలిలో రెండో రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చార్లెస్ మద్ధతు తెలిపారు.

విత్తన శుద్ధి చేయాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంట వేసే సమయంలో విత్తన శుద్ధి చేయాలని ఏడీఏ సాలురెడ్డి సూచించారు. ముడుమలగుర్తి గ్రామంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రబీలో రేగడి నెలల్లో విత్తనాలు శుద్ధి చేసి వేస్తే విత్తన సామర్థ్యం పెరిగి చీడ, పీడలను నివారించవచ్చన్నారు. కంది పంటపై డీఆర్‌సీ ఏడీఏ గిరీష్, మండల వ్యవసాయాధికారి పలు సూచనలు చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏలు, ఏవో

సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: పత్తి, మిరప పంటలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. గురువారం కౌతాళం మండలంలోని బదినేహాల్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.


పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మౌనిక, ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆదోని ఏడీఏ అరుణ కుమారి, ఈఆర్వీ వ్యవసాయాధికారి శశిధర్, ఉద్యానవన శాఖాధికారి హరేంద్ర, మండల వ్యవసాయాధికారి శేషాద్రి, రైతులు పాల్గొన్నారు.

గుండ్రేవుల, సంగాల (సి.బెళగల్), న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో మల్లేష కుమార్ సూచించారు. మండలంలోని గుండ్రేవుల, సంగాల గ్రామాల్లో పర్యటించి సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంపీఈవో వెంకటేశ్వర్లు, సోమేశ్వరి, వ్యవసాయ సహాయకులు సంధ్యారాణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: రైతులకు పంటలపై అవగాహన పెంపొందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏడీఏ మహ్మద్‌ఖాద్రి పేర్కొన్నారు. గురువారం నెరుడుప్పల, ఎర్రబాడు గ్రామాల్లో వ్యవసాయాధికారిణి హేమలత పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

నేడు, రేపు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో శుక్ర, శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రాల మరమ్మతులు, నూతన తీగల ఏర్పాటు పనుల కారణంగా డీ2 సెక్షన్ పరిధిలోని మద్దూర్‌నగర్, సీక్యాంపు, గణేశ్‌నగర్, రెవెన్యూ కాలనీ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, చెక్‌పోస్టు ప్రాంతం, పోస్టల్‌కాలనీ, కమలానగర్, టెలికాం నగర్, గఫూర్‌నగర్, ప్రశాంతినగర్, ఫుడ్ కార్పొరేషన్ ప్రాంతం, మాధవనగర్, బీక్యాంపు, గాయత్రి ఎస్టేట్స్, జొహరాపురం, జెమ్మిచెట్టు, రాంబొట్ల, అబ్బాస్‌నగర్, కృష్ణానగర్, గుత్తి పెట్రోల్ బంక్, శరీన్‌నగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీ2 సెక్షన్ ఏడీఈ రాజేంద్రబాబు వివరించారు.

వేతనాలు చెల్లించాలని డిమాండు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర పాలక పరిధిలోని క్లాప్ వాహన చోదకులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని నగర పాలక కమిషనర్ ఛాంబర్ ఎదుట డ్రైవర్లతో కలిసి బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. క్లాప్ వాహన చోదకులు నాలుగు నెలలుగా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: సమస్య: శ్రీనివాసనగర్, సీతారాంనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**

సమస్య: గుత్తి రోడ్డు సమీపంలో వర్షానికి రహదారిపై నీరు నిలిచింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- ఈశ్వర్**

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగర పాలక అధికారులు**

డీపీవోగా భాస్కర్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పంచాయతీ అధికారిగా జి. భాస్కర్ నగరంలోని కలెక్టరేట్‌లోని డీపీవో



డీపీవో భాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎల్‌పీవో తిమ్మక్క, ఉద్యోగులు

కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కర్నూలు డీఎల్‌పీవో తిమ్మక్క, కార్యాలయ ఏవో ప్రతిమ, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని పంచాయతీల ఆదాయ వనరులు పెంపొందించడం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నూతన డీపీవో తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా...

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) నాణ్యతా విభాగం కర్నూలు డివిజన్ డీఈఈగా కుష్‌కుమార్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం నుంచి బదిలీపై ఇక్కడకు రాగా.. ఇక్కడ పనిచేస్తున్న డీఈఈ ఉమేశ్‌కుమార్‌రెడ్డి డోన్‌కు బదిలీ అయ్యారు. నూతన డీఈఈకి కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి..

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా మహేశ్వరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేస్తున్న నాగరాజు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో మహేశ్వరరెడ్డి వైఎస్సార్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారులు మరమ్మతులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

డీఎస్ఈగా బాలచంద్రారెడ్డి..

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా బాలచంద్రారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వైఎస్సార్ జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన డీఎస్ఈకి కర్నూలు ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓర్వకల్లు ఎంపీడీవోగా శ్రీనివాసులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఓర్వకల్లు ఎంపీడీవోగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శివనాగప్రసాద్ గూడూరుకు బదిలీ కాగా, డోన్‌లో పని చేస్తున్న శ్రీనివాసులు ఓర్వకల్లుకు వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పని చేయని లిఫ్టులు

☛ కలెక్టరేట్, డీఈవో కార్యాలయాల్లో అలంకారప్రాయం



కలెక్టరేట్ కార్యాలయంలో రెండు వారాలుగా పని చేయని లిఫ్ట్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్, డీఈవో కార్యాలయాల్లో రెండు వారాలుగా లిఫ్టులు పని చేయడం లేదు. దివ్యాంగులు ఆయా శాఖల్లో పనులకు మెట్ల మార్గంలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను ఇటు కలెక్టరేట్, అటు విద్యా శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. లిఫ్టులక మరమ్మతులు, నిర్వహణ పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా కలెక్టరేట్‌లో 2019 డిసెంబరు 3న దివ్యాంగులు, వయోవృద్ధుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఒకటి, జిల్లా విద్యాశాఖలో మరొకటి లిఫ్టులు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన సిప్డ (స్కీమ్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ డిజెబులిటీస్ యాక్ట్-2016 ప్రకారం రూ.70 లక్షలతో రెండు లిఫ్టులు, రెండు ర్యాంపులు, కలెక్టరేట్ సముదాయంలో రెండు ప్రాంతాల్లో మరుగుదొడ్లు మంజూరయ్యాయి. జాన్సన్ లిఫ్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు లిఫ్టుల ఏర్పాటు బాధ్యతను అప్ప



డీఈవో కార్యాలయంలో నిరుపయోగంగా లిఫ్ట్

గించారు. కలెక్టరేట్‌లో సీపీవో కార్యాలయం దగ్గర కలెక్టర్ ఛాంబర్‌కు వెళ్లేందుకు ఒక లిఫ్ట్‌ను, డీఈవో కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఎస్ఎస్ఏ కార్యాలయం వరకు వెళ్లేందుకు మరొకటి ఏర్పాటు చేశారు. ఈ లిఫ్టుల ఏర్పాటు బాధ్యతలను జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించారు. కొంత కాలం వరకు ఇవి పని చేశాయి. వీటి నిర్వహణ బాధ్యతలు ఎవరూ పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురవుతున్నాయి. ఎలక్ట్రికల్ వర్క్‌లకు సంబంధించి రూ.14.39 లక్షలు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. మరమ్మతులు చేయించాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తోంది. ఇక సివిల్ వర్క్‌లకు సంబంధించి రెండు ర్యాంపులు సీపీవో కార్యాలయం దగ్గర ఒకటి, డీఎస్‌వో కార్యాలయం, దివ్యాంగుల శాఖ కార్యాలయానికి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద ర్యాంపులను ఏర్పాటు చేశారు. ఇక రెండు టాయ్‌లెట్ల నిర్మాణాలు ఎక్కడా చేపట్టలేదు. సివిల్ వర్క్‌లకు సంబంధించి రూ.16 లక్షల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. పది రోజులకు పైగా లిఫ్ట్ పని చేయకపోవడంతో మెట్ల మార్గంలో కలెక్టర్ ఛాంబర్‌కు వెళ్తున్నారు. సోమవారం అధిక సంఖ్యలో దివ్యాంగులు వస్తున్నారు. మెట్ల మార్గంలో వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. కలెక్టరేట్‌లో, డీఈవో కార్యాలయంలో నిరుపయోగంగా మారిన లిఫ్టులను జిల్లా రెవెన్యూ, దివ్యాంగులశాఖ అధికారులు చొరవ తీసుకుని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని దివ్యాంగులు చిరంజీవి, రాముడు కోరుతున్నారు.

టీజీని కలిసిన ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా నియమించిన ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్ మహేశ్ నాయుడు గురువారం మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను కలిశారు. ఆయన వెంట జొహరాపురానికి చెందిన రాజశేఖర్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, శ్రీరాములు ఉన్నారు.

పార్టీ కోసం పని చేసినవారికి తప్పక న్యాయం: తిక్కారెడ్డి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తెదేపా విజయానికి పని చేసినవారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని పార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో



తిక్కారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్‌లకు మిఠాయిలు పంచుతున్న షేక్ ముంతాజ్

కర్నూలు నగరానికి చెందిన కర్నూలు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు షేక్ ముంతాజ్‌ను ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్‌గా, పౌరసరఫరా కార్పొరేషన్ డైరెక్టర్‌గా తలముడిపి మహేశ్‌నాయుడిని నియమించారన్నారు. ఈ సందర్భంగా గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో తెదేపా నేతలకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, తెదేపా నాయకులు సత్రం రామకృష్ణుడు, షేక్షావలి, షమీ బాషా, శ్రీదేవి, లలిత, రేణుక పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మండల అధికారులను ఆదే



మాట్లాడుతున్న గౌరు చరితారెడ్డి

శించారు. గురువారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రంగనాథ గౌడ్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శివనాగప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: లక్ష్యాల పేరుతో తపాలా ఉద్యోగులను వేధించడం తగదని తపాలా పి-4 ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. తపాలా ఉద్యోగులకు ఖాతా లక్ష్యాలు పెట్టి



ఆందోళన చేస్తున్న పి-4 ఉద్యోగ సంఘం నాయకులు

ఉన్నతాధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు పి.నసేబ అధ్యక్షతన నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పోస్ట్ కార్డులు, ఈమెయిల్స్ ద్వారా మా డిమాండ్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగ సంఘం నాయకులు చైతన్య మనోహరరాజు, శమంతకరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినుల రక్షణే ముఖ్యం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల రక్షణే ముఖ్యమని ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ తెలిపారు. కేవీఆర్ కళాశాలలోని వసతి గృహం విద్యార్థినులకు, వసతి గృహ సంరక్షకురాలితో మనస్పర్థలు వచ్చాయి. ఈ విషయాన్ని విద్యార్థినులు ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యార్థినులు, వసతి గృహ సంరక్షకురాలితో మాట్లాడినట్లు పేర్కొన్నారు. గతంలో ఆహార నాణ్యతపై ఫిర్యాదు చేస్తే పోషకాహారం ఇస్తున్నామన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని ఎ.క్యాంపునకు చెందిన యశ్వంత్ ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. ఈ నెల 1న పని నిమిత్తం గాంధీ నగర్ వెళ్లిన ఆయన వాహనం కనిపించకుండా పోయిందన్నారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మునెప్ప, రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో బళ్లారి చౌరస్తా ప్రాంతం నుంచి గోవిందు, ధనలక్ష్మి, ఖాసింబితోపాటు మరికొందరు పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించినట్లు తెలిపారు.

☛ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక అందించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.



కర్నూలు ఆధ్యాత్మికం: నెహ్రూనగర్ సాయీశ్వర ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



కర్నూలు ఆధ్యాత్మికం: పాతబస్తీ నిమిషాంబ పుష్పాలంకరణలో శక్తిమాత



కర్నూలు బి.క్యాంపు: నాగసాయిబాబా ఆలయంలో..



నగరంలోని నిమిషాంబ దేవాలయంలో...



కర్నూలు ఆధ్యాత్మికం: సూర్యనారాయణ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జగజ్జనని.. కాపాడు కల్పవల్లి



కర్నూలు ఆధ్యాత్మికం: కర్నూలు చిన్నఅమ్మవారిశాలలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టుచీర అందజేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ దంపతులు



కల్లూరు గ్రామీణం: శరీన్‌నగర్‌లో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో

☛ బాలత్రిపుర సుందరిగా..

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయాల్లో అమ్మవారు కొలువుదీరారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం వేళలో అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు, లలితా సహస్రనామావళి చేశారు. పాతబస్తీలోని చిన్నఅమ్మవారిశాలలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ దంపతులు పట్టుచీర అందజేశారు. పాతబస్తీలోని లలితా పీఠం, కాళికాంబ ఆలయం, గీతా మందిరం, నిమిషాంబ ఆలయం, భద్రావతి భావనారాయణ ఆలయం, కేసీ కాల్వ సమీపంలోని చౌడేశ్వరీ, సూర్యనారాయణ, నెహ్రూనగర్‌లోని సత్యసాయీశ్వర, కల్లూరులోని కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

కల్లూరులో..

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్లూరు పట్టణం, గ్రామీణ పరిధిలో మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరి రూపంలో అమ్మవారు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నగరంలోని బి.క్యాంపు రాజరాజేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాజరాజేశ్వరి రూపంలో దర్శనమిచ్చారు. నాగసాయిబాబా ఆలయంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అన్నమాచార్య ప్రాజెక్టు తిరుపతివారి సౌజన్యంతో హరికథా కాలక్షేపం నిర్వహించారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరి రూపంలో అలంకరించారు. మహిళలు సామూహిక లలితా పారాయణం, కుంకుమార్చనలు చేశారు.

ఓర్వకల్లులో..

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని హుసేనాపురంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారికి తెదేపా నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



కర్నూలు బి.క్యాంపు: లలితా సహస్రనామ పారాయణంలో మహిళలు



కల్లూరు గ్రామీణం: నగరంలోని చిన్మయ మిషన్‌లో పూజలు చేస్తున్న చిన్నారులు



కర్నూలు బి.క్యాంపు: రాజరాజేశ్వరి ఆలయంలో హరికథ చెబుతున్న కళాకారుడు

పిస్టల్ గురిపెట్టారు.. పసిడి పట్టారు

☛ లక్ష్యం వైపు దూసుకెళ్తున్న విభిన్న ప్రతిభావంతుడు



పిస్టల్ షూట్‌లో సాధన చేస్తున్న ముస్తాక్ అహ్మద్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: పుట్టుకతో శారీరక లోపమున్న ముస్తాక్ అహ్మద్ ఒక లక్ష్యం పెట్టుకున్నారు. ఆర్థిక సమస్యలున్నా, చెరగని ఆత్మవిశ్వాసంతో పిస్టల్ క్రీడలో దూసుకెళ్తున్నారు. రాష్ట్ర స్థాయి యూత్ పిస్టల్ పోటీల్లో పసిడి పతకం సాధించి జాతీయ పోటీలపై గురి పెట్టారు.

కర్నూలు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సయ్యద్ ముస్తాక్ అహ్మద్ వేంకటేశ్వర ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేశారు. తల్లిదండ్రులు సయ్యద్ వహిదాబీ, ఎండీ హుసేన్. తండ్రి టీజీ వెంకటేశ్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వర్తించేవారు. 2016లో తండ్రి మృతితో అహ్మద్ కూడా టీజీవీ గ్రూప్‌నకు చెందిన మౌర్యఇన్‌లో ఉద్యోగావకాశం కల్పించారు. నగరంలోని ఖండక్‌పురానికి చెందిన నిష్రద్‌బీను 2022లో వివాహం చేసుకున్నారు. అహ్మద్ వాలంటీర్‌గా పని చేస్తున్నారు. మూడు నెలలుగా వేతనం రాకపోవడంతో క్రీడా పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 2023 జూన్‌లో గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పారాషూట్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించారు. రెండుసార్లు పతకాలు రాలేదు. అయినా ఆత్మవిశ్వాసంతో మరింత సాధన చేశారు. 2024 సెప్టెంబరులో అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారాషూట్ పోటీల్లో 10 మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించారు. అలాగే సెప్టెంబరు 29న విశాఖలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర స్థాయి పారాషూట్ పిస్టల్ పోటీల్లో 10 మీటర్ల లక్ష్యాన్ని ఛేదించి పసిడి పతకం అందుకున్నారు. ఇదే నెలలో అనంతపురం నిర్వహించిన పోటీల్లోనూ స్వర్ణ పతకం సాధించారు. ఈ నెల 24న దిల్లీలో కల్నల్‌సింగ్ షూటింగ్ రేంజ్ పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యంగా కార్యదర్శి ఎండీ బాషా సహకారంతో శిక్షకుడు రవికుమార్ పర్యవేక్షణ సాధన చేస్తున్నట్లు అహ్మద్ వివరించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 రగ్బీ పోటీలు గురువారంతో ముగిశాయి. తుది పోరులో అనంత



తృతీయ స్థానంలో నిలిచిన కర్నూలు జట్టు

పురం జట్టు, తూర్పుగోదావరిపై 20-0తో విజయం సాధించింది. రన్నర్స్ ట్రోఫీని తూర్పుగోదావరి జట్టు సాధించింది. మూడో స్థానానికి జరిగిన పోరులో కర్నూలు జట్టు, పశ్చిమగోదావరిపై 25-0తో గెలిచి కాంస్య పతకం అందుకుంది. విజేతలకు జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, ఆదర్శ విద్యా సంస్థల డైరెక్టర్ హరికిషన్ పతకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హర్షవర్ధన్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నసుంకన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కాంస్య పతకం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: అక్టోబరు 1, 2 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థి జాన్‌వెస్లీ 35 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఆయన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు ఫయాజ్, ఉపాధ్యాయుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినంధన

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: సెప్టెంబరు 29న నంద్యాలలో రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో శంకరాస్ కళాశాల విద్యార్థిని రాణించి రన్నర్స్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. వీరిని శంకరాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరికిషన్, విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల వైస్ ప్రిన్సిపల్ మద్దిలేటి, వ్యాయామ అధ్యాపకులు మద్దయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్

నేటి నుంచి మహిళా క్రీడలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని రామచంద్రనగర్‌లోని శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం నుంచి 5వ తేదీ వరకు ఆర్‌యూ అనుబంధ అనుబంధ కళాశాలల మహిళా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహణ కార్యదర్శి, కళాశాల ప్రిన్సిపల్ జానీ బాషా గురువారం తెలిపారు. ఈ పోటీలను ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ ప్రారంభిస్తారన్నారు.

థాయిఆఖర్ వక్తృత్వ పోటీలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: 2024-25 సంవత్సరానికి థాయిఆఖర్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు ప్రధాన పర్యవేక్షకుడు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ది జాయ్ ఆఫ్ రైటింగ్, ఇంపార్టెంట్ ఆఫ్ లెటర్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. కర్నూలు డివిజన్‌లో 18 ఏళ్లు పైబడిన వారందరూ వినియోగించుకోవాలన్నారు.

ఉల్లి క్వింటాల్ గరిష్ఠ ధర రూ.4,119

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పంట ఉత్పత్తుల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. మార్కెట్‌కు 7,475 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటాల్ కనిష్ఠ ధర రూ.495, మధ్యస్థం రూ.2,658, గరిష్ఠం రూ.4,119 పలికింది. మార్కెట్‌కు 1,715 క్వింటాళ్ల వేరుశనగకాయల దిగుబడులు రాగా క్వింటాల్ కనిష్ఠ ధర రూ.2,917, మధ్యస్థం రూ.5,219, గరిష్ఠం రూ.7,220 పలికింది. పూల విత్తనాలు క్వింటాల్ రూ.6,109, ఆముదాలు రూ.6,066, మొక్కజొన్న రూ.2,371, ఎండుమిర్చి రూ.2,899, కొర్రలు రూ.2,839, మినుములు రూ.8,109, సజ్జలు రూ.2,201కు వ్యాపారులు ఈ.నామ్ ద్వారా కొనుగోలు చేశారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సవరణను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం ఆయన నగర పాలక నూతన కౌన్సిల్ హాల్‌లో బీఎల్వోలతో సమీక్షించారు. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ,



మాట్లాడుతున్న నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు

యువకులకు కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు, చనిపోయినవారి ఓటు తొలగింపు, సవరణలు వంటివి తప్పులు లేకుండా చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

◆ నగరంలో ధ్వంసమైన ఫుట్‌పాత్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. రాజ్‌విహార్, వడ్డెగేరి, ఆర్ఎస్ కూడలి, కిసాన్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు.